క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమావేశం

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 14న కొవ్వూరు నియోజకవర్గ పర్యటనకు విచ్చేయనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం పది గంటలకు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ సమావేశానికి విధిగా హాజరు కావాలని మంత్రి క్యాంపు కార్యాలయ వర్గాలు కోరాయి. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మునిసిపల్ కౌన్సిలర్లు, చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌లు, ఇతర పార్టీ పదవుల్లోను, నామినేటెడ్ పదవుల్లోను, పార్టీ పదవుల్లోను ఉన్న నాయకులందరూ విధిగా హాజరు కావాలని కోరారు.

కరాటే బెల్ట్ టెస్ట్‌ల విజేతలు వీరే



కరాటే బెల్ట్ టెస్ట్ పోటీల విజేతలను అభినందిస్తున్న దేవరపల్లి ఎస్సై శ్రీహరిరావు

దేవరపల్లి: పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణంలో గురువారం నిర్వహించిన కరాటే బెల్ట్ టెస్ట్ పోటీల్లో దేవరపల్లికి చెందిన రేయిన్ రమ్య కరాటే ఇండియా స్టైల్ విద్యార్థులు ఎస్.శ్రీనేహ, పి.జగదీష్, బి.సురేంద్ర (ఆరెంజ్ బెల్ట్) సాధించారు. అలాగే ఎస్.శ్రీనిత్య, ఓ.ఆసీస్‌వర్మ, ఎన్.జోత్స్నశ్రీ , కె. తీర్థశ్రీఫణి, ఓ.సాయి నిఖిల్‌వర్మ (ఎల్లో బెల్ట్) సాధించినట్టు కరాటే మాస్టర్ జక్కంశెట్టి శ్రీనివాస్ తెలిపారు. విజేతలైన విద్యార్థులను శుక్రవారం స్థానిక ఎస్సై కె. శ్రీహరిరావు అభినందించారు.

బాలదుర్గమ్మ ఆలయంలో తులాభారం



చిన్నారిని నాణేలతో తులాభారం వేస్తున్న కుటుంబ సభ్యులు

దేవరపల్లి: ఎంపీపీ కేవీకే దుర్గారావు, విజయలక్ష్మి దంపతుల మనుమరాలైన బాలదేవాన్సీకి స్థానిక బాలదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం పటిక బెల్లం, చిల్లర నాణేలతో వేర్వేరుగా తులాభారం వేసి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దుర్గారావు, ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పోస్టు కార్డు ఉద్యమం

గోపాలపురం: అదానీపై విచారణకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశించే వరకూ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ఉద్యమం ఆగదని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేష్ఠ సతీష్‌బాబు అన్నారు. గోపాలపురంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం కాంగ్రెస్ పోస్ట్ కార్డు ఉద్యమం నిర్వహించింది. కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు మట్టపర్తి రామమోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కొల్లి రామసూరిరెడ్డి, అయిల శేషగిరి, పిట్టా రామారావు, కొలూరి రతన్‌రాజు మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందించాలి

నిడదవోలు రూరల్: పట్టణంలోని తీరుగూడెంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు వెంటనే అందించాలని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో టిడ్కో ఇళ్ల వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని నినాదాలు చేశారు.

ముక్కు మూసుకుని సాగిపోవాల్సిందే



తాళ్లపూడిలో కంటి ఆసుపత్రి వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

తాళ్లపూడి: స్థానిక నటరాజ్ థియేటర్ ఎదురుగా గల వీధిలో డ్రెయిన్ పొంగి మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దాంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమీప గృహాల వారు వాడిన నీరు అండర్ గ్రౌండ్ డ్రెయిన్ నుంచి సీసీ రోడ్డు పైకి వస్తుండడంతో అక్కడంతా దుర్గంధం వ్యాపిస్తోంది. ఈ మార్గం మీదుగా ప్రజలు నిత్యం సచివాలయానికి, పాఠశాలకు, సమీపంలోని లయన్స్ కంటి ఆసుపత్రికి రాకపోకలు సాగిస్తుంటారు. అయినా ఇక్కడి పారిశుధ్య లోపాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జగనన్నతోనే మంచి భవిష్యత్తు

- హోంమంత్రి తానేటి వనిత
- 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రారంభం
- ఈ నెల 20 వరకూ ఇంటింటికీ గృహ సారథులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు



నిడదవోలు వైఎస్సార్ కాలనీలో సంక్షేమ పథకాలపై లబ్ధిదారుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



నల్లజర్లలోని ఓ ఇంటి వద్ద ఐదు ప్రశ్నలకు వివరాలు సేకరించి ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



కొవ్వూరు ఇందిరమ్మ కాలనీలో ఓ ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న హోంమంత్రి తానేటి వనిత

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి రాష్ట్ర ప్రజలకు ధైర్యంగా చెప్పే కార్యక్రమమే 'జగనన్నే మా భవిష్యత్తు 'అని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. కొవ్వూరు పట్టణంలోని 19వ వార్డు ఇందిరమ్మ కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శుక్రవారం మంత్రి వనిత ప్రారంభించారు. ఈ కార్యక్రమం గురించి ఆమె ఇంటింటికీ వివరిస్తూ, ప్రజల మద్దతు తీసుకుంటూ ముందుకు సాగారు. ప్రతి ఇంటి నుంచి వివరాలు సేకరించి, మంత్రే స్వయంగా వారి అభిప్రాయాలను నమోదు చేశారు. 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను ఇంటింటికీ అతికించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ ప్రజలంతా మా భవిష్యత్తు జగనన్నే.. భవిష్యత్తు నువ్వే అంటూ జగనన్నపై ఉన్న అభిమానాన్ని చాటుకుంటున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు లక్షల మంది 14 రోజుల పాటు కోటీ 60 లక్షల కుటుంబాలను సర్వే చేస్తారని వివరించారు. గత అవినీతి టీడీపీ ప్రభుత్వానికి, ఈ సంక్షేమ ప్రభుత్వానికి తేడాను గమనించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాసరావు, పట్టణశాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, కౌన్సిలర్లు అంకోలు లిల్లీ పద్మ, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, కో-ఆప్షన్ మెంబర్ అలీ, గంధం సాయి తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గత 46 నెలలుగా కుల, మత, రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నామని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. నిడదవోలు పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి తమ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలు గురించి లబ్ధిదారులతో మాట్లాడారు. వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ముందుగా దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాల నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తోందన్నారు. అదే టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన అరకొర పథకాలు అందాలన్నా జన్మభూమి కమిటీలకు, దళారులకు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించామని చెప్పారు. 'నాడు-నేడు' కింద పాఠశాలలు, ప్రభుత్వాసుపత్రుల రూపురేఖలను మార్చామన్నారు. చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమ పథకాలను సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తారన్నారు. అంతేగాకుండా 'మా నమ్మకం నువ్వే జగన్' డోర్, మొబైల్ స్టిక్కర్లు అతికిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ సంక్షేమ పాలనను మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల శాఖల అధ్యక్షులు మద్దిపాటి ఫణీంద్ర, అయినీడి పల్లారావు, వీరమల్లు సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, జెడ్పీటీసీ సభ్యులు నందిగం భాస్కరరామయ్య, కొయ్యే సూరిబాబు, కొమ్మిశెట్టి రామాంజని, ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ గాజుల రంగారావు, పార్టీ జిల్లా మైనార్టీ, విద్యార్థి విభాగం అధ్యక్షులు ఎస్‌కే వజీరుద్దీన్, మానుకొండ చంద్రబాబు, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని వెలగదుర్రు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో కఠారి సిద్ధార్థరాజు, ముదునూరి సతీష్‌రాజు, సాగి రామకృష్ణంరాజు, ఇందుకూరి మురళీకృష్ణరాజు, ధనిశెట్టి ఉమామహేశ్వరరావు, పాలాటి శరత్‌బాబు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లజర్ల దళిత కాలనీలో..

నల్లజర్ల: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శుక్రవారం ఉదయం నల్లజర్ల గ్రామంలోని దళిత కాలనీలో ప్రారంభించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. తొలుత విలేకరులతో ఆయన మాట్లాడారు. నాలుగేళ్లుగా వివిధ పథకాల ద్వారా రూ.2,500 కోట్ల వ్యయంతో గోపాలపురం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామన్నారు. శుక్రవారం ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈనెల 20 వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే వెంకట్రావు ఇద్దరు గృహ సారథులు, వార్డు వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో కలసి ఆ కాలనీలోని ప్రతి ఇంటినీ సందర్శించారు. వారి నుంచి ఐదు ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకుని, ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేశారు. గృహ యజమానుల అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ అంటించారు. కార్యక్రమంలో అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ళ భాస్కరరావు, ఎంపీపీ బంక జయలక్ష్మి, వైస్ ఎంపీపీలు అచ్యుత శివాజీ, ఆరుగొల్లు మణి, జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి, సొసైటీ చైర్మన్ కారుమంచి రమేష్, నాయకులు ప్రతాపనేని వాసుబాబు, బంక అప్పారావు, వామిశెట్టి పరమేశ్వరావు, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, తొమ్మంద్రు రమేష్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గోపాలపురం: మా నమ్మకం నువ్వే జగనన్న పోస్టర్‌ను శుక్రవారం గోపాలపురంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, మండల సచివాలయ కన్వీనర్ తానింకి సత్యనారాయణ ఆవిష్కరించారు. అలాగే మండలంలోని రేగులగుంటలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, వివిధ గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్లు పంపిణీ చేశారు.వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు పోతిరెడ్డి నాగరాజు, మండల మహిళా అధ్యక్షురాలు యండపల్లి కవిత, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దేవరపల్లి: జగనన్నతోనే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ప్రారంభించారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల అధ్యక్షులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన, గతంలో జరిగిన చంద్రబాబు పాలనకు గల తేడాను ప్రజలకు వివరించారు. దేవరపల్లిలో ఎంపీపీ కేవీకే దుర్గారావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గృహ సారథులు, గ్రామ సచివాల కన్వీనర్లు, గ్రామ వలంటీర్లను వెంట బెట్టుకుని ఆయన గృహాలను సందర్శించారు. ఇంటి యజమాని అంగీకారంతో గోడలకు, సెల్‌ఫోన్‌కు మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను అతికించారు.

సునాయాస పంట అనాస



మల్లేశ్వరంలో అనాస కాయలు

పెరవలి: ప్రత్యేకంగా నీరుగాని, ఎరువుగాని అవసరం లేదు. తెగుళ్లు కూడా పెద్దగా సోకవు. పెట్టుబడి అవసరం లేదు. సొమ్ము చెల్లించకుండా విత్తనం కూడా ఉచితంగా దొరుకుతుంది. సరదాగా సాగు చేస్తే ఆదాయాన్ని తెచ్చిపెడుతుంది. ఇదే అనాస పంట. లాభాలు కురిపించే అనాస సాగుపై ఈ ప్రాంత రైతులు మక్కువ చూపుతున్నారు. అనాస కాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. వేసవిలో వచ్చే ఈ పంట దిగుబడి రైతులకు అదనపు ఆదాయాన్ని తెచ్చిపెడుతుంది. పెరవలి మండలంలోని తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి, లంకమాలపల్లి, అన్నవరప్పాడు, మల్లేశ్వరం గ్రామాల్లో సుమారు 60 ఎకరాల్లో అనాస సాగు చేస్తున్నారు. ఒక మొక్క సీజన్‌లో మూడు కాయలు కాస్తుంది. వాటి నుంచి వచ్చే పలవల ద్వారా మరో మూడు కాయలు కాస్తాయని రైతులు చెబుతున్నారు. ఈ కాయలు సైజును బట్టి మార్కెట్‌లో ఒక్కొక్కటి రూ.40 నుంచి రూ.70 రేటు పలుకుతోంది. రైతులు ఎక్కువగా తమ పంట భూముల గట్ల చుట్టూ అనాసను సాగు చేస్తున్నారు. ఎకరం పొలం చుట్టూ గట్లపై అనాస మొక్కలు నాటితే వాటి ద్వారా ఏడాదికి రూ.5000 నుంచి రూ.6000 అదనపు ఆదాయం వస్తోందని రైతులు చెబుతున్నారు. పంటలకు పెట్టే నీరే వీటికి జీవనాధారమని వివరిస్తున్నారు.

పాపుల రక్షణకే క్రీస్తు శిలువ మరణం

- భక్తిశ్రద్ధలతో శుభ శుక్రవారం
- పలు చర్చిల ఆధ్వర్యంలో శిలువ మార్గం
- ప్రత్యేక ప్రార్థనలు



యర్నగూడెంలో శిలువ మార్గం నిర్వహిస్తున్న ఫాదర్ దానియేలు, పాస్టర్లు



ఉండ్రాజవరం క్రీస్తు లూథరన్ చర్చిలో వాక్యోపదేశం చేస్తున్న దైవజనులు



తాళ్లపూడి మండలం వేగేశ్వరపురంలో శిలువ మోస్తున్న ఫాదర్ జాన్

నిడదవోలు రూరల్: పాపుల రక్షణ కోసమే ఏసు క్రీస్తు సిలువ మరణం పొందారని గోపవరం బైబిల్ మిషన్ సంఘ కాపరి ఎల్లే విజయరాజు అన్నారు. పట్టణంలోని కృపాధార లూథరన్ చర్చి, రాయిపేటలోని మెంటే సుందరరావు మెమోరియల్ టౌన్ లూథరన్ చర్చి, ఆర్‌సీఎం, బైబిల్ మిషన్, మండలంలోని ఆయా గ్రామాల్లో క్రైస్తవులు శుభ శుక్రవారాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పురుషోత్తపల్లి, సమిశ్రగూడెం, రావిమెట్ల, డి.ముప్పవరం గ్రామంలో క్రీస్తు వేషధారణలో శిలువ వేసే ఘట్టాలను విశ్వాసులు కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. అన్ని చర్చిల్లో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

దేవరపల్లి: శుభ శుక్రవారం (గుడ్ ఫ్రైడే) వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు.శిలువలను భుజాలపై వేసుకుని గ్రామాల్లో శిలువ మార్గం నిర్వహించారు. యర్నగూడెంలోని ఆర్‌సీఎం చర్చి సంఘం ఆధ్వర్యంలో శిలువ మార్గం జరిగింది. రెవరెండ్ ఫాదర్ దానియేలు, పాస్టర్ జాన్, కన్యస్త్రీలు, దైవజనులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవ విశ్వాసులు గుడ్‌ఫ్రై డే పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శిలువపై ఏసుక్రీస్తు చెప్పిన సప్త సూక్తులతో స్తుతించి ప్రార్థన చేశారు. ఉండ్రాజవరంలోని క్రీస్తు లూథరన్ చర్చి, బైబిల్ మిషన్ చర్చి, తాడిపర్రు ఐబీఎం చర్చిలలో దైవజనులు ఆర్.ఇజ్రాయిల్, జి.పాల్, కె.జయరావు వాక్యోపదేశం చేశారు. వేలివెన్ను, కాల్దారి, మోర్త, పాలంగి, దమ్మెన్ను, వెలగదుర్రు, సూర్యారావుపాలెం తదితర గ్రామాల చర్చిల్లో ఆరాధనలు జరిగాయి.

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని నిత్య సహాయ గోదావరి మేరీమాత పుణ్యక్షేత్రం నుంచి గ్రామంలో శిలువ మారం నిర్వహించారు. డైరెక్టర్ టి.జాన్ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను క్రైస్తవులకు జాన్ వివరించారు. కార్యక్రమంలో ఏలూరుకు చెందిన రెవరెండ్ ఫాదర్ ఇమ్మానియేల్, జనసేన అధ్యక్షుడు గంటా కృష్ణ, ఆర్‌సీఎం చర్చి పరిధిలోని విశ్వాసులు పాల్గొన్నారు. వేగేశ్వరపురంలోని లూథరన్, మలకపల్లిలోని క్రైస్ట్ కమ్స్ చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు.

గోపాలపురం: పాస్టర్ల సంఘం అధ్యక్షుడు కె. రత్నరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఏసు శిలువతో గోపాలపురంలో ప్రదర్శన నిర్వహించారు. సహచర సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

చాగల్లు: బ్రాహ్మణగూడెం చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో కె.సాల్మన్‌రాజు దైవ సందేశం వినిపించారు. మతాలకు అతీతంగా ప్రజలందరూ జరుపుకునే ఈ పండుగకు ప్రజల్లో అత్యంత నమ్మకం ఉందన్నారు.క్రీస్తు మరణం సందర్భంగా 40 రోజుల శ్రమదినాలను ఉపవాస దీక్షతో ప్రార్థనలు చేసి ఆయన ప్రజల కోసం పడిన శ్రమను స్మరించుకోవడం అందరికి ఆనవాయితీ అన్నారు. మూడో రోజున ఆయన సమాధి నుంచి లేచి పునరుత్థానం పొందారన్నారు. ఏసుక్రీస్తు శిలువ మరణంతో మానవాళికి రక్షణ లభించిందన్నారు. చాగల్లు, గౌరిపల్లి, మార్కొండపాడు, దారవరం, ఊనగట్ల, ఎస్.ముప్పవరంలలో గుడ్ ఫ్రై డే నిర్వహించారు.

లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలి



హౌసింగ్ అధికారులతో సమీక్ష జరుపుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించేలా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు సూచించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పురోగతిపై హౌసింగ్ పీడీ జి.పరశురాం, డీఈ ఎస్.చంద్రశేఖర్‌తో శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హౌసింగ్, మునిసిపల్ అధికారులు సమన్వయంతో కలిసి పనిచేసి లే అవుట్‌లో రోడ్లు, డ్రెన్లు, విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు ఇళ్లస్థలాల మెరక పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఇళ్లు కట్టుకునేందుకు వచ్చే లబ్ధిదారులకు గృహ నిర్మాణాలు మంజూరు చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, ఏతా గిరీష్, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారులకు మహర్దశ

- నియోజకవర్గంలో రూ. 121 కోట్లతో అభివృద్ధి
- మరో రూ.9 కోట్లతో గ్రామీణ లింక్ రోడ్ల పునర్నిర్మాణం
- తీరిన ప్రయాణికుల వెతలు



అజ్జరం నుంచి తణుకు వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డు



అన్నవరప్పాడు గ్రామంలో సిమెంట్ రోడ్డుగా వడలి-ముక్కామల ఆర్ అండ్ బీ రహదారి

పెరవలి: ఒకప్పుడు నిడదవోలు నియోజకవర్గంలో వాహనాలపై తిరగాలంటే ప్రయాణికులు హడలిపోయేవారు. రహదారులు అంత అధ్వానంగా ఉండేవి మరి. ఆ పరిస్థితి ఇపుడు పూర్తిగా మారిపోయింది. బ్రేక్‌పై కాలు వేయకుండానే వాహనదారులు శరవేగంగా దూసుకుపోయేలా రహదారులు మెరుగు పడ్డాయి. జిల్లాలోని మరే నియోజకవర్గంలోనూ లేని విధంగా ప్రధాన రహదారులు, లింక్ రోడ్లు కలిపి మొత్తం 95 నిర్మించారు. ఇందుకోసం రూ.121 కోట్లు ఖర్చు చేశారు. ప్రధానంగా ఆర్ అండ్ బీకి చెందిన నిడదవోలు- నరసాపురం రోడ్డును రూ.42 కోట్లతోను, వడలి -ముక్కామల రోడ్డును రూ.22 కోట్లతోను, నిడదవోలు-యర్నగూడెం రోడ్డును రూ.6.50 కోట్లతోను, నిడదవోలు-విజ్జేశ్వరం, నిడదవోలు-ప్రత్తిపాడు రోడ్లను రూ.7 కోట్లతోను పునర్ నిర్మించారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని ప్రధాన రహదారులన్నీ సర్వాంగ సుందరంగా ఉన్నాయి.

ఇప్పుడిక లింక్ రోడ్లపై..

నియోజకవర్గంలో ప్రధాన రోడ్ల నిర్మాణాలన్నీ పూర్తవడంతో ఇక లింక్ రోడ్ల అభివృద్ధిపై ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు దృష్టి పెట్టారు. ఇందుకోసం రూ.9 కోట్లు వెచ్చించారు. వాటిలో ప్రధానమైనవి అజ్జరం- తణుకు రోడ్డు రూ. 84 లక్షలు, నల్లాకులవారిపాలెం- ముక్కామల రోడ్డు రూ.64 లక్షలు, ఓదూరివారిపాలెం- ముక్కామల రోడ్డు రూ.58 లక్షలతో నిర్మించారు. ఇప్పడిక గ్రామాల్లోని రోడ్లు, డ్రైన్లపై దృష్టి సారించారు. మండల పరిషత్, గ్రామ పంచాయతీల నిధులతో ఈ పనులు చేపట్టారు.

30 ఏళ్ల తరువాత రోడ్ల నిర్మాణం

నిడదవోలు- నరసాపురం, వడలి-ముక్కామల ఆర్ అండ్ బీ రహదారులు పెరవలి మండలంలో దాదాపు మూడు దశాబ్దాల పాటు నిర్లక్ష్యానికి గురయ్యాయి. శ్రీనివాస్‌నాయుడు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాకే వీటి అభివృద్ధిపై దృష్టి పెట్టారు. గతంలో 18 అడుగుల వెడల్పున ఉండే నరసాపురం రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేస్తూనే 24 అడుగులకు వెడల్పు చేశారు.ఈ రోడ్డుపై ప్రయాణం ఇప్పుడెంతో సుఖవంతంగా ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. వడలి -ముక్కామల రోడ్డును రూ.22 కోట్లతో సీసీ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణంతో 12 గ్రామాల ప్రజలకు రహదారి సమస్య పరిష్కారమైంది.

ఊహించలేదు



నిడదవోలు-నరసాపురం ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా ఉండేది. ఫలితంగా తరచూ ఎక్కడో ఒకచోట ప్రమాదాలు సంభవించేవి. ఎప్పటికైనా ఈ రోడ్డు మెరుగు పడుతుందా? అనుకునే వారం. ఎమ్మెలే కృషితో ఎవరూ ఈ రోడ్డును 24 అడుగుల వెడల్పుతో పునర్ నిర్మించారు. గతంలో ఏ ప్రజా ప్రతినిధికానీ, ఏ ప్రభుత్వం కానీ ఈ రోడ్డు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు.

–కాపకా పాపారావు, కాకరపర్రు

రైతులకు మేలు



మా గ్రామానికి రెండు ప్రధాన గ్రామీణ లింక్ రోడ్లు ఉన్నాయి. అవి రెండూ కూడా చాలా అధ్వానంగా ఉండేవి. అసలు రోడ్డు వేస్తారా? మనం చూస్తామా? అని మాట్లాడుకునే వారం. ఊహించని విధంగా ఈ రెండు లింక్ రోడ్ల నిర్మాణం పూర్తిచేశారు. దీని వల్ల రైతులకు ఎంతో మేలు జరిగింది.

–కంకిపాటి వెంకటేశ్వరరావు, ముక్కామల

పక్కా ప్రణాళికతో..



ఎన్నికల సమయంలో ప్రచారానికి వెళ్లినపుడు అధ్వానంగా ఉన్న రోడ్ల వల్ల పడుతున్న అవస్థలను స్వయంగా చూశాను. ప్రజల నుంచి ప్రధానంగా రోడ్లు, డ్రైన్లు నిర్మించాలంటూ వినతులు ఎక్కువగా వచ్చేవి. ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక ఈ సమస్యపై దృష్టి పెట్టాను. పక్కాగా ప్రణాళిక రూపొందించి, ప్రభుత్వ నిధులతో ప్రదాన రోడ్లు నిర్మించాను. అంతే కాకుండా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని గ్రామాలు అభివృద్ధి చేసాను, ఇంకా చేయాలి, చేస్తాను.

– జి శ్రీనివాస్ నాయుడు ఎమ్మెల్యే నిడదవోలు

నేడు మంత్రి వనిత పర్యటన ఇలా...

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత కొవ్వూరు పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం పది గంటలకు నిర్వహించే వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం నాలుగు గంటలకు పట్టణంలోని లిటరరీ క్లబ్‌లో నిర్వహించే గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకుల సమావేశంలో పాల్గొంటారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

కొవ్వూరు: ఆరికిరేవుల ఇసుక ర్యాంపు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ గ్రామానికి చెందిన నాగ అనే వివాహిత గాయపడింది. ఆమె తన భర్త పప్పుల సంతోష్‌తో కలసి మోటార్ సైకిల్‌పై వస్తోంది. వెనుక నుంచి వస్తున్న కారు ఆ దంపతులను ఢీ కొట్టింది. నాగను రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. సంతోష్ స్వల్పంగా గాయపడ్డాడు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఈ ఘటనపై పట్టణ ఎస్సై డి.భూషణం కేసు నమోదు చేశారు.